సీసీ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం



2



2
గడ్డపార గ్యాంగ్ అరెస్ట్..

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## బోర్గాం(పి) పాఠశాలలో ఆరోగ్యంపై అవగాహన

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేతుల పరిశుభ్రత, పౌష్టికాహారం లోపం, సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు తదితర అంశా లపై వివరించారు. జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ అజ్మల్ విద్యార్థులకు పరిశుభ్రత, మానసిక పరిపక్వత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్, ఏఎన్ఎం లత, ఆశా వర్కర్లు సరోజ, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలి: సీపీ

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు వ్యవస్థ పనిచేయాలని సీపీ సాయి చైతన్య సూచించారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు బోధన్ డివిజన్ పరిధిలో జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై బోధన్ సర్కిల్ కార్యాలయంలో సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రధానంగా బోధన్ డివిజన్ పరిధిలో సమస్యాత్మక, అతిసమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో ఏసీపీ శ్రీనివాస్, సీఐలు విజయ్‌బాబు, వెంకట్ నారాయణ, శ్రీనివాస్, కృష్ణ, ఎస్సైలు మచ్చేందర్ రెడ్డి, రమ, చంద్రమోహన్, సునీల్, ఎస్.రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## అబార్షన్ ఘటన.. ప్రైవేట్ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్

**అక్షరటుడే, కామారెడ్డి:** గర్భం దాల్చిన యువతికి అబార్షన్ చేసిన ఘటనపై పోలీసుల విచారణ వేగంగా కొనసాగుతోంది. వారం రోజులుగా ఇటు వైద్యాధికారులు, అటు పోలీసుల విచారణలో ఓ గైనకాలజిస్టు అబార్షన్ చేసినట్టుగా తేలింది. కామారెడ్డి పట్టణంలోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ ఈ అబార్షన్ చేసినట్లుగా గుర్తించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తాడ్వాయి మండలానికి చెందిన యువతి గత నెల 27న కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. ఆస్పత్రి గైనకాలజిస్ట్ ఓ స్కానింగ్ సెంటర్‌కు పరీక్షల నిమిత్తం పంపగా ఆ యువతి స్కానింగ్ సెంటర్‌లో పరీక్షలు చేసుకుని మరుసటి రోజు డాక్టర్ వద్దకు వెళ్లగా అబార్షన్ చేసింది. ఈ విషయం పోలీసులు, వైద్యాధికారుల విచారణలో తేలినట్టుగా తెలుస్తోంది. సదరు ఆస్పత్రి మేనేజ్‌మెంట్ కూడా సోమవారం తాడ్వాయి ఠాణాకు పిలిపించి విచారించినట్లుగా సమాచారం. ఎర్రపహాడ్ మెడికల్ ఆఫీసర్, సంబంధిత గ్రామ ఆశా వర్కర్, ఏఎన్ఎం ద్వారా జిల్లా వైద్యాధికారి దివ్య నివేదిక తెప్పించుకుని మంగళవారం అబార్షన్ చేసిన ఆస్పత్రి, గైనకాలజిస్ట్‌తో పాటు స్కానింగ్ సెంటర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లుగా తెలిసింది.



## శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**అక్షరటుడే ఇందూరు:** శివాజీని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. శివాజీ మహారాజ్ సేవాసమితి 2026 నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్ శివాజీ, త్రిమూర్తి పవన్, రాజుకుమార్ సుబేదార్, ప్రణయ్, విజయ్ కుమార్, సాయి, చందు, సుకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఏ ఊరిలో చూసినా ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం సాయంత్రంతో ప్రచార పర్వం ముగిసింది. మిగతా పల్లెల్లో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు సోషల్ మీడియాను ఆయుధంగా మలుచుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ఫొటోలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. - అక్షరటుడే గాంధారి



# 'స్మార్ట్'గా ప్రచారం

■ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి ■ సోషల్ మీడియాలో ప్రచార హోరు ■ సాంగ్స్, స్టేటస్‌తో హోరెత్తిస్తున్న వైనం ■ ముగిసిన మొదటి విడత ప్రచార పర్వం

ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూప్‌లు ఉన్నాయి. దీంతో అభ్యర్థులు స్మార్ట్‌ఫోన్‌ను ప్రచార ఆయుధంగా మార్చుకున్నారు. ఇంటింటి ప్రచారం చేయడంతో పాటు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. రీల్స్, సినిమా పాటలతో అభ్యర్థుల ఫొటోలు ఎడిట్ చేసి వీడియోలు చేస్తున్నారు. తమను గెలిపించాలని కోరుతున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల అనుచరులు వా ట్సాప్ స్టేటస్, గ్రామా వాట్సాప్ గ్రూపుల్లో తమ అనుచరుడికి సంబంధించిన పోస్టులు పెడుతున్నారు.

### ఒకరిని మించి మరొకరు

సర్పంచ్ అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా ప్రచారం చేస్తున్నారు. ఒకరిని మించి ఒకరు వరాల జల్లులు కురిపిస్తున్నారు. అంతేగాకుండా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఆడియోలు, వీడియోలు, ఫొటోలు పెట్టి ప్రచారం చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు సాంకేతికతను అందిపుచ్చుకొని సోషల్ మీడియాలో ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

### పోస్టర్లతో పోరు

సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం జోరు అందుకున్న తరుణంలో వారి గుర్తులు కనిపించే విధంగా గోడలపై పోస్టర్లను అతికిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అభ్యర్థుల పోస్టర్లను ప్రత్యర్థులు చించివేస్తున్నారు. మరొకొన్ని చోట్ల గుర్తులపై మరో అభ్యర్థి పోస్టర్లు అతికిస్తున్నారు. ఇలాంటి వాటిపై సైతం ప్రజలు వాట్సాప్ గ్రూపుల్లోనే గొడవ పడుతున్నారు. తమ నాయకుడికి మద్దతుగా పోస్టులు చేస్తున్నారు. ఇలాంటివి చేయడం చాలా అరాచకమని మెసేజ్‌ల ద్వారానే ప్రశ్నిస్తున్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రంతో ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం 5 తర్వాత ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో రెండు అంతర్‌జిల్లా చెక్ పోస్టులు, 2 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేటి సాయంత్రం నుంచి ఎన్నికలు జరిగే 10 మండలాల్లో మద్యం విక్రయాలు చేపట్టవద్దన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 50 లిక్కర్ కేసులు నమోదు చేయడం జరిగిందని, రూ. 4.94 లక్షల విలువ చేసే 536 లీటర్ల మద్యం సీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. 195 మందిని బైండోవర్ చేశామని, ఆరు ఎంసీసీ వాయిలేషన్ కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేయకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో 14 క్రిటికల్, 14 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలకు గుర్తించామని





ఎస్పీ తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని వివరించారు. సెన్సిటివ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. సిగ్నల్స్ లేని ప్రాంతాలలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కౌంటింగ్ ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు.



## నిజామాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

**అక్షరటుడే, ఇందూరు :** జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రోడ్లు-భవనాల శాఖ ఎస్ఈ కె.సర్దార్ సింగ్ ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన నమూనాను అనుసరిస్తూ జిల్లాల్లో కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విగ్రహాన్ని రూపొందించారు. ఆకట్టుకునే రీతిలో, స్ఫూర్తిదాయకంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ , వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో కలెక్టరేట్‌లో..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా బతుకమ్మ, బోనాలు తీసుకుని వచ్చారు. తెలంగాణ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరిస్తారని అందరూ భావించారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ బదులుగా ఆర్అండ్‌బీ ఈఈ మోహన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ ఏర్పాటు

**అక్షరటుడే, ఇందూరు :** కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. తెలంగాణ విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షను భగ్నం చేయడానికి అక్రమంగా అరెస్టు చేసినా.. నిరాహార దీక్షను కొనసాగించిన మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని బిగాల కొనియాడారు. ప్రజల దశాబ్దాల పోరాటానికి తలవంచి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. ఆర్టికల్-3 ద్వారా తెలంగాణ ప్రజల దశాబ్దాల వాంఛ నెరవేరిందని పేర్కొన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు తీసుకువచ్చానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రకటించడాన్ని ఖండిస్తున్నట్లు బిగాల గణేశ్ గుప్తా తెలిపారు. గతంలో జిల్లా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆనాటి సీఎం కేసీఆర్ అర్బన్ అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్ల నిధులు ప్రకటించారన్నారు. జీవో వచ్చిన వెంటనే పట్టణంలో ఆర్ఆర్ చౌరస్తా నుంచి పాత కలెక్టర్ మైదానం వరకు కృతజ్ఞత ర్యాలీ కూడా నిర్వహించామని గుర్తు చేశారు. సుమారు 90 శాతం పనులకు తాము భూమి పూజ చేశామని.. కానీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ తన హయాంలో రూ.100 కోట్ల నిధులు తెచ్చానని ఎమ్మెల్యే ధన్‌పాల్ చెప్పుకోవడం సమంజసం కాదని బిగాల అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్న గారి విఠల్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ నీతూ కిరణ్, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, చింతకాయల రాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అభివృద్ధి కోసం పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులనే గెలిపించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. మహమ్మద్ నగర్‌తో పాటు దూప్‌సింగ్ తండా, గిర్ని తండా, గాలిపూర్, మగ్దుంపూర్, కోమలంచ, తుంకిపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదిహేనేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన హన్మంత్‌షిండే నియోజకవర్గ అభివృద్ధిపై కనీస శ్రద్ధ చూపించలేదని, గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు కూడా అందించలేకపోయారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి కోసం కాంగ్రెస్ మద్దతుదారులనే గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు గ్రామాలకు మధ్య సర్పంచ్‌లు వారధిగా నిలబడాలని సూచించారు. సమన్వయంతోనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని స్పష్టం చేశారు.





## సోనియా చొరవతోనే తెలంగాణ ఏర్పాటు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సోనియా చొరవతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని.. తెలంగాణ ప్రజలు ఆమెకు రుణపడి ఉంటారని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదినం నిర్వహించారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేశారు. అలాగే యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నగేష్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న గొప్పవ్యక్తి సోనియాగాంధీ అని పేర్కొన్నారు. దేశం కోసం భర్త మృతి చెందినప్పటికీ దుఃఖాన్ని దిగమింగుకుని పార్టీ కోసం నిలబడిన వ్యక్తి సోనియాగాంధీ అని నగేష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, భక్తవత్సలం, జావీద్ అక్రమ్, రత్నాకర్, రామర్తి గోపి, విపుల్ గౌడ్, వేణు రాజ్, రాజా నరేందర్ గౌడ్, సేవాదళ్ సంతోష్, యాదగిరి, ఈసా, మఠం రేవతి పాల్గొన్నారు.



## జీజీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్, కెరీర్ గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. రిలయన్స్ జియో టెలికాం కంపెనీలో నవీపేట్, నందిపేట్, బాల్కొండ, వేల్పూరులలో జియో పాయింట్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ తదితర పోస్టులను భర్తీ చేశారు. అభ్యర్థులను వివిధ దశల్లో పరీక్షించి 22 మందిని ఎంపిక చేసినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ సమన్వయ కర్త డాక్టర్ రామకృష్ణ, పీఆర్‌వో దండు స్వామి, రాజేష్, కంట్రోలర్ భరత్ రాజ్, శ్రీకాంత్, రఘుతేజ, మహావీర్, సుమన్ పాల్గొన్నారు.

పదికాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లు.. వేసిన నెలల్లోపే దెబ్బతింటున్నాయి. కొన్ని చోట్ల నాసిరకం ఇసుక వాడకం, మరికొన్నిచోట్ల ఇసుకకు బదులుగా డస్ట్ వాడడంతో రోజుల వ్యవధిలోనే బీటలు వారుతున్నాయి. నెలలు గడిచేకొద్దీ రోడ్లపై భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ఇవేం రోడ్లు అంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే, బాన్సువాడ



# నిర్మాణంలో నిర్లక్ష్యం

- సీసీ రోడ్డు వేసిన నెలకే పగుళ్లు
- నాసిరకం ఇసుక, డస్ట్ వాడకం
- పట్టించుకోని అధికారులు

బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డుపై నెలలు గడవక ముందే పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా త్వరగా పగుళ్లు వచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు కేవలం కొన్ని నెలల్లోనే స్పష్టంగా పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా మోరం వేయకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రమాదాలకు అవకాశం పెరిగిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాధనం వృథా..

ప్రజాధనం ఖర్చు పెట్టి ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ నిధులు వృథా అవుతున్నాయని గ్రామస్థులు మండిపడుతున్నారు. సీసీ రోడ్డు పనులు నాణ్యత లేకుండా జరగడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసే సమయంలో నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు.. అమ్యామ్యాలకు అలవాటుపడి గుడ్డిగా బిల్లులు మంజూరు చేస్తున్నారు.



### తక్షణమే బాగు చేయాలి

సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డును అత్యవసరంగా మరమ్మతు చేసి భవిష్యత్తులో ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, బాల్కొండ:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు బాల్కొండ పోలీసులు మంగళవారం ఆయా గ్రామాల్లో విస్తృతస్థాయి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు అవసరమైన ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. అలాగే ఓటీపీలు ఎవరికి చెప్పవద్దన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొంతమంది సోషల్ ఇంజినీరింగ్, మోసపూరిత ఫోన్‌కాల్స్, డిజిటల్ అరెస్ట్ వంటి కొత్త తరహా సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు వాసుదేవ్, భాస్కర్, రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఒకరి నేత్రదానం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం చిన్న రాంపూర్ తండాకు చెందిన బానోత్ గణేష్ అకాల మరణం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. అయితే గణేష్ ఇక లేడనే బాధలోనూ ఆయన కుటుంబ సభ్యులు చూపిన ఔదార్యం అందరికీ ఆదర్శంగా నిలిచింది. గణేష్ మరణించిన వెంటనే కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఈ మానవతా స్ఫూర్తితో చేసిన నిర్ణయం వల్ల ఇద్దరు అంధులకు కొత్త వెలుగు లభించనుంది. తాను లేనప్పటికీ తన చూపు ఇంకొకరి జీవితాన్ని వెలిగించాలనే గణేష్ కోరికను కుటుంబసభ్యులు నెరవేర్చినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ ప్రజలు, స్నేహితులు గణేష్ కుటుంబాన్ని అభినందిస్తూ, ఇటువంటి సేవాభావం ప్రతి ఇంటికి విస్తరించాలని కోరుతున్నారు. నేత్రదానం మహోన్నతమైన సేవ అని, గణేష్ కుటుంబం చూపిన మార్గం చాలా మందికి ప్రేరణగా నిలుస్తుందని వైద్యులు పేర్కొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

**అక్షరటుడే, బాల్కొండ:** కిసాన్‌నగర్ లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ బాల్కొండ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు 20 మందికి కంటి పరీక్షలు చేశారు. మోతి బిందు సమస్య ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లింగం, జోనల్ చైర్మన్ జీవన్, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 40 ఏళ్లుగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీగా పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని పోచారం గ్రామానికి ప్రత్యేకత ఉంది. సుమారు 40ఏళ్లుగా ఈ జీపీ ఏకగ్రీవ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడంతో గ్రామస్థుల్లో కొంత ఆసక్తి నెలకొంది. అయితే స్క్రూటినీలో ఒకరి నామినేషన్ తిరస్కరించబడడంతో పోటీ తిరిగి ఏకగ్రీవమైంది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం పోచారం 1984లో జీపీగా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో ఏకగ్రీవం అవుతూ వస్తోంది. గ్రామస్థుల మధ్య పరస్పర అవగాహన, సహకారం కారణంగానే నాలుగు దశాబ్దాలుగా పోచారం గ్రామం ఏకగ్రీవ నిర్ణయాలకు వేదికవుతోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎస్టీ రిజర్వ్ కావడంతో యువకుడు రమేష్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఉదయ్‌కిరణ్



**అక్షర టుడే గాంధారి:** సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఉదయ్ కిరణ్ ఎంపికైనట్లు బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సేవంత తెలిపారు. నవంబర్ 18న తెలంగాణ వర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన ఎంపిక పోటీలో రాణించిన ఉదయ్ కిరణ్‌ను సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఎంపిక చేశారని వివరించారు. డిసెంబర్ 8 నుంచి రాజమండ్రిలో జరిగే పోటీలకు తెలంగాణ వర్సిటీకి ప్రాతినిధ్యం వహించనున్నట్లు వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఫౌండేషన్ చీఫ్ ప్యాట్రన్ గుగ్లోత్ సురేందర్, బాధ్యులు లక్ష్మణ్ రాథోడ్ బాల కృష్ణ, రామ కృష్ణ, సోనియా, దశరథ్, సౌమ్య అభినందించారు.



## ఫొటో, వీడియోగ్రాఫర్లకు శిక్షణ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్, సోనీ కంపెనీ సంయుక్తంగా ఫొటో, వీడియోగ్రాఫర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈ శిక్షణ శిబిరం నిర్వహించగా నగరంలోని ఫొటో, వీడియ గ్రాఫర్లే కాకుండా వివిధ మండలాల నుంచి సైతం పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోని కంపెనీ ఫ్యాకల్టీ సతీష్, ఫారూక్, అమిత్ ఫొటో,వీడియోగ్రాఫర్లకు ఆయా అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమానికి అసోసియేషన్ టౌన్ అధ్యక్షుడు శివాజీ, ప్రతినిధులు రామరాజు, షరీక్, కార్యవర్గ సభ్యులు, శివజ్యోతి ఎలక్ట్రానిక్స్ సతీష్, ఏముల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** విజయ్ దివస్‌ను బీఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించారన్నారు. ఈ సందర్భంగా ఆయన నినదించిన రోజు డిసెంబర్ 9వ తేదీని విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాలిక్ బాబా, మాజీ కో–ఆప్షన్ మెంబర్ అజీమ్ లతీఫ్, అహ్మద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డపార గ్యాంగ్ అరెస్ట్.. ఎట్టకేలకు దొంగలను పట్టుకున్న పోలీసులు

**అక్షరటుడే, కామారెడ్డి :** తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తారు.. తాళాలు పగులగొట్టి ఇళ్లు దోచేస్తారు.. వెళ్తూ..వెళ్తూ.. ఆ ఇంటి ముందు గడ్డపారలు వదిలి వెళ్తారు.. ఇలా వరుస చోరీలకు పాల్పడుతూ సవాల్ విసిరిన దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు ఎట్టకేలకు కటకటాల వెనక్కి నెట్టారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్‌చంద్ర మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో ఈనెల 12న ఓ ఇంటి తాళాన్ని గడ్డపారతో పగులగొట్టి ఇంట్లోని బీరువాలో బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన జరగగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సీఐ సంతోష్, గాంధారి, తాడ్వాయి ఎస్సైలు ఆంజనేయులు, నరేష్‌లతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా బైక్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ సాక్షికంగా లభించడంతో మరోసారి చోరీలకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురు ముఠా సభ్యులు పట్టుబడ్డారు. వీరు జిల్లాలో తాడ్వాయితో పాటు గాంధారి, లింగంపేట, రాజంపేట, బాన్సువాడ పరిధిలోని తొమ్మిది ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఉదయం సాధారణ వ్యక్తుల మాదిరిగా గ్రామాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో తాళాలు వేసి ఇళ్లలో చోరీలకు పాల్పడడం వీరి అలవాటు. చోరీ అనంతరం గడ్డపారలను అక్కడే వదిలి వెళ్తారు. ఇలా చోరీల ద్వారా సేకరించిన సొత్తును బాన్సువాడ, నిజామాబాద్ జ్యూవెలరీ షాపులలో విక్రయిస్తున్నట్టుగా పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో గాంధారి మండలం గుర్జాల్ తండాకు చెందిన బస్సీ జోధ్ రాజ్, మహారాష్ట్ర మైందానే గ్రామానికి చెందిన అంకుష్ ప్రేమ్ సింగ్ సాబలే (ప్రస్తుత నివాసం గుర్జాల్ తండా) ఉన్నారు. అలాగే గాంధారి మండలం చెన్నపూర్ తండాకు చెందిన బామన్ మహేందర్, నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కోల్పోల్ గ్రామానికి చెందిన హీరాలాల్, నునావత్ గణేష్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 11 తులాల బంగారు ఆభరణాలు, 22 తులాల వెండి నగలు, ఒక బైక్, 5 మొబైల్స్, రూ.8500 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించి సిబ్బందికి అవార్డు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సదాశివనగర్ సీఐ సంతోష్, తాడ్వాయి, గాంధారి ఎస్సైలు నరేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.




## యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జీగా విక్కీయాదవ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆదిలాబాద్ జిల్లా యూవజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా విక్కీయాదవ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విక్కీయాదవ్ ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా నియమించినందుకు గాను జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జి ఖలీద్‌కు విక్కీయాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బైక్ చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం వివరాలు వెల్లడించారు. నగరంలో పలు చోట్ల బైక్ చోరీలు జరిగినట్లుగా ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం పక్కా సమాచారంతో నగరంలో తిరుగుతున్న ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీలు, టెక్నికల్ ఎవిడెన్స్, ఇంటెలిజెన్స్ సమాచారంతో బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన అమీర్‌ఖాన్, కామారెడ్డి జిల్లా వడ్లూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని వారిరువురిని రిమాండ్‌కు తరలించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన 44వ జాతీయ రహదారిపై డిచ్‌పల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. డిచ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిని దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వేగంగా ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే అతడి వివరాలు తెలియరాలేదు. మృతుడి మెడ కుడి వైపు ఒక టాటూ, ఎడమ చేయి మణికట్టుపై ఒక టాటూ ఉంది. ఇతర సమాచారం కోసం డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## పేపర్ ప్లేట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం: భారీగా ఆస్తినష్టం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఓ పేపర్‌ప్లేట్స్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భవానీ పేపర్ ప్లేట్స్ దుకాణంలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో షాప్‌లో ఉన్న పేపర్ ప్లేట్లు, ఇతర వస్తువులు తగలబడిపోయాయి. వెంటనే స్పందించిన యజమాని, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వో సతీశ్, ఎస్సై శ్రీకాంత్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది శంకర్, మధు తదితరులు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.9లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

